2.9 కోట్ల బంగారం సీజ్

- దుబాయ్ నుంచి వచ్చిన ముగ్గురి అరెస్టు

శంషాబాద్ రూరల్, జనవరి 1: శంషాబాద్ విమానాశ్రయంలో సోమవారం రూ.2.9 కోట్ల విలువైన కిలోన్నర బంగారాన్ని కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. బంగారాన్ని అక్రమంగా తరలిస్తున్న ముగ్గురిని అరెస్టు చేశారు. కస్టమ్స్ అధికారుల వివరాల ప్రకారం.. దుబాయ్ నుంచి వేర్వేరు విమానాల్లో వచ్చిన ముగ్గురు ప్రయాణికులపై అనుమానం రావడంతో అధికారులు వారి లగేజీని తనికీ చేయగా, ఒక కిలో 459 గ్రాముల బంగారం లభించింది. ముగ్గురిని అదుపులోకి తీసుకొని కస్టమ్స్ కార్యాలయానికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు అధికారులు వెల్లడించారు.

నేటి నుంచి శ్రీవారి సర్వదర్శనం టోకెన్ల జారీ

హైదరాబాద్, జనవరి 1 (నమస్తే తెలంగాణ): శ్రీవారి సర్వదర్శనం టోకెన్ల జారీని మంగళవారం పునఃప్రారంభించనున్నట్టు టీటీడీ తెలిపింది. తెల్లవారుజామున 4 గంటల నుంచి తిరుపతిలోని కౌంటర్ల ద్వారా సర్వదర్శనం టోకెన్లు లభిస్తాయని వెల్లడించింది. అదేరోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి దర్శన స్లాట్లు ప్రారంభమవుతాయని పేర్కొన్నది. డిసెంబర్ 23న ప్రారంభమైన వైకుంఠ ద్వార దర్శనం సోమవారం రాత్రి ఏకాంతసేవతో శాస్త్రోక్తంగా ముగిసింది. శ్రీవారి సర్వదర్శనానికి భక్తులు ఆదివారం సాయంత్రానికి క్యూకాంప్లెక్స్‌లోని 13 కంపార్ట్‌మెట్లలో వేచి ఉన్నారు. వీరికి దాదాపు ఐదుగంటల్లో శ్రీవారి దర్శనం కల్పిస్తున్నట్టు టీటీడీ వెల్లడించింది.

సమీక్ష తర్వాతే దళితబంధు!

- రెండో విడత కింద లక్షా 30వేల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఇచ్చేందుకు గత సర్కారు నిర్ణయం
- పలువురికి అందజేత.. లబ్ధిదారుల జాబితా సిద్ధం
- సమీక్ష పూర్తయ్యేంత వరకు నిలిపేయాలని అధికారుల ఆదేశం
- హుజూరాబాద్‌లో లబ్ధిదారుల అకౌంట్లు కూడా ఫ్రీజ్

హైదరాబాద్, జనవరి 1 (నమస్తే తెలంగాణ): కొత్తగా ఏర్పాటయిన ప్రభుత్వం సమీక్షా సమావేశం నిర్వహించేంత వరకూ దళితబంధు పథకం ముందుకు సాగదని తెలుస్తున్నది. ఈ మేరకు ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులే వెల్లడిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇప్పటికే సగం మొత్తం నిధులు విడుదల చేసిన లబ్ధిదారుల అకౌంట్లను కూడా ఫ్రీజ్ చేసినట్టు వివరిస్తున్నారు. ప్రభుత్వం నుంచి తదుపరి ఆదేశాలు వచ్చే వరకూ అవి అలాగే కొనసాగనున్నాయని సమాచారం. దళితబంధు మొదటి విడతలో మొత్తంగా 38,323 దళిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయాన్ని గత ప్రభుత్వం అందజేసింది. వారంతా యూనిట్లను ఏర్పాటు చేసుకోవడంతో విజయవంతంగా ఆర్థిక పురోగతి సాగిస్తున్నారు. దళితబంధు రెండో విడతలో భాగంగా 2023-24 సంవత్సరానికిగాను హుజూరాబాద్ నియోజకవర్గం మినహా మిగిలిన 118 నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1100 కుటుంబాల చొప్పున, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కోటాలో మరో 200 దళిత కుటుంబాలకు కలిపి మొత్తంగా 1,30,000 కుటుంబాలకు ఆ పథకాన్ని వర్తింపజేయాలని నిర్ణయించింది. ఆ దిశగా ఇప్పటికే అధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అన్నిజిల్లాల పరిధిలో నిర్దిష్ట సంఖ్యలో దళితబంధు ఎంపికకు సంబంధించిన జాబితాలు కూడా తుదిదశకు చేరుకొన్నాయి. ఆయా జాబితాల్లో దరఖాస్తుదారుల వివరాలను క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ ప్రారంభించారు. అర్హులను గుర్తించి లబ్ధిదారుల ఎంపికను సైతం చేపట్టారు. రెండోవిడతలో భాగంగా జీహెచ్‌ఎంసీ పరిధిలో హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల పరిధిలో దాదాపు 162 సఫాయి కర్మచారి సిబ్బందిని గుర్తించి, వారికి రూ.16.20 కోట్లతో సిల్ట్ కార్టింగ్ వెహికిల్స్‌ను అందించి దళితబంధు రెండోవిడతను గత ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించింది. అయితే, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మిగతా లబ్ధిదారులకు యూనిట్ల పంపిణీకి బ్రేక్ పడింది.

దళితబంధుపై కాంగ్రెస్ సర్కారు సమీక్ష

ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో ఈ పథకంపై అందరూ ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. అయితే ప్రభుత్వం పూర్తిస్థాయి సమీక్ష నిర్వహించిన తర్వాతే దీనిపై స్పష్టత వచ్చే అవకాశముందని అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో పలువురు దళితబంధు లబ్ధిదారుల అకౌంట్లను ఫ్రీజ్ చేసినట్టు చెప్తున్నారు. దళితబంధు పథకం కింద రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని నేరుగా లబ్ధిదారుల అకౌంట్లలో జమ చేసిన విషయం తెలిసిందే. అందులో కొంత సొమ్ముతో లబ్ధిదారులు చిన్న చిన్న యూనిట్లను పెట్టుకోగా, మిగతా నిధులను అకౌంట్లలోనే భద్రపరుచుకొన్నారు. ఆ నిధులకు బ్యాంకులు వడ్డీని కూడా జమచేస్తున్నాయి. ప్రస్తుతం పథకంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేకపోవడంతో ఆ అకౌంట్లను ఫ్రీజ్ చేశారు. లబ్ధిదారులు ఎలాంటి లావాదేవీలు నిర్వహించకుండా నిలుపుదల చేశారు. ఈ మేరకు జిల్లాల అధికారులు సైతం బ్యాంకులకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం సాంఘిక సంక్షేమశాఖ మంత్రిగా ఎవరూ బాధ్యతలను స్వీకరించలేదు. మరోవైపు సాంఘిక సంక్షేమ సెక్రటరీగా ఉన్న రాహుల్‌బొజ్జాను జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో పూర్తిస్థాయి కార్యదర్శిని ప్రభుత్వం ఇప్పటివరకు నియమించలేదు. దీంతో శాఖాపరమైన కార్యక్రమాలన్నీ స్తంభించిపోయాయి. మంత్రితోపాటు కార్యదర్శి వచ్చి, సమీక్ష నిర్వహించిన తర్వాతే దళితబంధుపై స్పష్టత వచ్చే అవకాశమున్నది. ఈ నేపథ్యంలోనే అధికారులు సైతం అకౌంట్లను ఫ్రీజ్ చేసినట్టు సమాచారం.

దళితబంధు స్థానంలో అంబేద్కర్ అభయహస్తం?

దళితబంధు పథకాన్ని ప్రభుత్వం కొనసాగిస్తుందా? లేదా? అని లబ్ధిదారులతోపాటు దళితవర్గాల్లోనూ జోరుగా చర్చ కొనసాగుతున్నది. అయితే దళితబంధు తరహాలోనే అంబేద్కర్ అభయహస్తం కింద రూ.12 లక్షల చొప్పున ఆర్థిక సాయాన్ని అందిస్తామని కాంగ్రెస్ సర్కారు సైతం ఇప్పటికే ప్రకటించింది. చేవేళ్లలో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లో ఈ మేరకు హామీ ఇచ్చింది. వచ్చే ఐదేండ్లలో అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు సరిపడా నిధులు కేటాయిస్తామని కూడా మ్యానిఫెస్టోలో స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఆ పథకం అమలు చేయాలన్నా సాంఘిక సంక్షేమశాఖ మంత్రి తప్పనిసరి. మంత్రి వస్తే తప్ప ఆయా అంశాల్లో స్పష్టత రాదనేది సుస్పష్టంగా తెలుస్తున్నది.

2024 క్యాలెండర్ ఆవిష్కరణ

న్యాయ శాఖ ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను హైకోర్టు సీజే అలోక్ అరాధే సోమవారం తన స్వగృహంలో ఆవిష్కరించారు. సంఘం అఖిల భారత అధ్యక్షుడు బోధ లక్ష్మారెడ్డి తదితరులున్నారు

రాష్ట్ర అడ్వొకేట్ జనరల్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న సుదర్శన్‌రెడ్డి

ఏజీగా సుదర్శన్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, జనవరి 1 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర అడ్వొకేట్ జనరల్‌గా సీనియర్ న్యాయవాది ఏ సుదర్శన్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. హైకోర్టులోని ఏజీ కార్యాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ఏజీగా బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమానికి అదనపు ఏజీలు తేరా రజనీకాంత్‌రెడ్డి, ఇమ్రాన్‌ఖాన్, ఇతర ప్రభుత్వ న్యాయవాదులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు.

బైరి నరేశ్‌ను అడ్డుకున్న అయ్యప్ప భక్తులు

- గతంలో చేసిన వ్యాఖ్యలపై నిలదీసిన మాలధారులు
- తిరుగు ప్రయాణంలో మాలధారుడిని ఢీకొట్టిన నరేశ్ కారు
- నరేశ్‌ను అరెస్టు చేయాలంటూ భక్తుల ఆందోళన

ఇక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ బైరి నరేశ్‌ను డిమాండ్ చేస్తున్న అయ్యప్ప భక్తులు

ఏటూరునాగారం, జనవరి 1: ములుగు జిల్లా ఏటూరునాగారంలో నాస్తికుడు బైరి నరేశ్, అయ్యప్ప భక్తుల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఫంక్షన్ హాల్‌లో సోమవారం ప్రజా చైతన్య సదస్సు ఏర్పాటు చేయగా, ముఖ్య అతిథిగా నరేశ్ హాజరయ్యారు. గతంలో ఆయన అయ్యప్ప స్వామిని, భక్తులను కించపర్చేలా మాట్లాడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బైరి నరేశ్ వచ్చిన విషయం తెలుసుకున్న అయ్యప్ప మాలధారులు ఫంక్షన్ హాల్‌కు చేరుకొని ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని కోరారు. దీంతో కొద్దిసేపు వాగ్వాదం తలెత్తి ఉద్రిక్తతకు దారి తీసింది. గతంలో తనపై ఇదే విషయమై కేసులు నమోదయ్యాయని, తాను అన్న మాటలను వెనక్కి తీసుకున్నానని, తనను క్షమించాలని నరేశ్ కోరారు. అనంతరం వెనుదిరిగి వెళ్తుండగా అయ్యప్ప భక్తుడు పోగు నర్సింహారావు కాలు మీది నుంచి నరేశ్ కారు టైరు వెళ్లింది. అయినా కారు ఆపకుండా వెళ్లడంతో కోపోద్రిక్తులైన భక్తులు కొందరు నరేశ్‌ను అరెస్టు చేయాలని నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. మరికొందరు వెంబడించారు. కమలాపురం వైపు వెళ్తున్న బైరి నరేశ్ ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపు తప్పి రోడ్డు కింద చెట్లల్లోకి దూసుకెళ్లింది. కారు ఎయిర్ బ్యాగ్ తెరుచుకోవడంతో నరేశ్‌తోపాటు అందులో ఉన్న వారికి ప్రమాదం తప్పింది. అనంతరం కారు దిగి పారిపోయారు. సమాచారం అందుకున్న ఎస్సై కృష్ణప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. కారును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గాయపడిన నర్సింగరావును మొదట ఏటూరునాగారం మండల కేంద్రంలోని సామాజిక వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం వరంగల్‌కు తరలించారు.

ఒకే పనికి ఒకే తరహా వేతనాలు

- జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, జనవరి 1, (నమస్తే తెలంగాణ): ఒకే తరహా విధులు నిర్వహించే ఉద్యోగులకు ఒకే తరహా జీతాలు చెల్లించాలని జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థకు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. పోస్టుగ్రాడ్యుయేషన్ చేసిన వారికి, డిగ్రీ చేసిన వారికి వేర్వేరు విధాల జీతాలు చెల్లించడం సబబుకాదని స్పష్టంచేసింది. తమ తీర్పు ఉత్తర్వులు అందిన ఎనిమిది వారాల్లోగా పిటిషనర్ల వేతనాల్లో వ్యత్యాసాలను సరిచేయాలని ఆదేశించింది. పోస్టు గ్రాడ్యుయేషన్ చేసిన వారికి ఒకలా, డిగ్రీ చేసిన వారికి మరొకలా వేతనాలు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ ఏపీ రాష్ట్ర హెచ్‌ఐవీ కౌన్సిలర్స్ అండ్ టెక్నీషియన్స్ యూనియన్ 2012లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఒకే పనికి ఒకే వేతనం ఉండకపోవడం రాజ్యాంగ విరుద్ధమని, అందరికీ సమాన వేతనాలు చెల్లించేలా ఉత్తర్వులు ఇవ్వాలన్న పిటిషనర్ వాదనతో కోర్టు ఏకీభవించింది.

విద్యా - ఉద్యోగ సమాచారం

సర్కారుకు పేపర్ లీకేజీల భయం

హైదరాబాద్, జనవరి 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వానికి పేపర్ లీకేజీల భయం పట్టుకున్నది. దీంతో ఇప్పటి నుంచే అధికారులను అప్రమత్తం చేస్తున్నది. ఎలాంటి లీకేజీలకు ఆస్కారం లేకుండా పకడ్బందీగా పరీక్షలను నిర్వహించాలని ఆదేశించింది. ఇటీవల విద్యాశాఖపై సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో పది, ఇంటర్ పరీక్షల నిర్వహణపై అధికారులకు గట్టి హెచ్చరికలు జారీచేసినట్టు తెలిసింది. 2019లో ఇంటర్ ఫలితాలు తారుమారు కావడం.. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడాన్ని సీఎం ఆ సమావేశంలో ప్రస్తావించినట్టు తెలిసింది. దీంతోపాటు 2022లో పదో తరగతి పేపర్ లీక్ కావడాన్ని సైతం గుర్తుచేసిన సీఎం ఈసారి ఇంటర్, పదో తరగతి వార్షిక పరీక్షల్లో అలాంటి తప్పిదాలకు ఆస్కారం ఉండరాదని హెచ్చరించినట్టు అధికారవర్గాలు తెలిపాయి. ముఖ్యంగా పదోతరగతి పేపర్ లీకులతో చాలా బద్నాం కావాల్సి ఉంటుందని.. గతంలో ఇదే జరిగిందని మొత్తంగా పరీక్షలను సవ్యంగా నిర్వహించాలని ఆదేశించినట్టు అధికార వర్గాల ద్వారా తెలిసింది. ఫిబ్రవరి 28 నుంచి ఇంటర్, మార్చి 18 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే. ఇంటర్‌కు 9 లక్షలకు పైగా, పదోతరగతి పరీక్షలకు 5 లక్షలకు పైగా విద్యార్థులు హాజరుకానున్నారు. మొత్తంగా ఈ పరీక్షలను సజావుగా నిర్వహించకుంటే అప్రతిష్టను మూటగట్టుకుంటామన్న ఆందోళన ప్రభుత్వంలో కనిపిస్తున్నది.

ఇంటర్ పరీక్షాకేంద్రాల పెంపు

హైదరాబాద్, జనవరి 1 (నమస్తే తెలంగాణ) : ఇంటర్ పరీక్షాకేంద్రాలు ఈ ఏడాది పెరగనున్నాయి. అదనంగా 32 పరీక్షా కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. విద్యార్థుల సంఖ్య పెరిగిన దృష్ట్యా పరీక్షాకేంద్రాలను పెంచాలని అధికారులు నిర్ణయం తీసుకొన్నారు. నిరుడు ఇంటర్ పరీక్షలకు 1,480 పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేయగా, ఈ ఏడాది 1,512 పరీక్షాకేంద్రాలను సిద్ధం చేయాలని నిర్ణయించారు. నిరుడుతో పోల్చితే ఈసారి 30 వేల మంది విద్యార్థులు అదనంగా పెరిగారు. ఈ ఏడాది ఇంటర్‌లో మొత్తం 10,59,233 మంది విద్యార్థులున్నారు. వీరిలో ఇప్పటివరకు 9,77,040 మంది విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించారు. అయితే, ఈ నెల 3 వరకు విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉన్నది.

పాత రాష్ట్రపతి ఉత్తర్వులనే అమలుచేయండి

హైదరాబాద్, జనవరి 1 (నమస్తే తెలంగాణ) : కొత్త రాష్ట్రపతి ఉత్తర్వుల స్థానంలో 1975 రాష్ట్రపతి ఉత్తర్వులను అమలు చేయాలని లోకల్ క్యాడర్ గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడోజు వీరాచారి సోమవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను కలిసి, వినపత్రం అందజేశారు. పాత రాష్ట్రపతి ఉత్తర్వులను తిరిగి పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు.

ఇంటర్ పరీక్షలకు సహకరిస్తాం : టిగ్లా

హైదరాబాద్, జనవరి 1 (నమస్తే తెలంగాణ) : ఇంటర్ వార్షిక పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అన్ని రకాలుగా సహకరిస్తామని తెలంగాణ ఇంటర్ గవర్నమెంట్ లెక్చరర్స్ అసోసియేషన్ (టిగ్లా) రాష్ట్ర ప్రధానకార్యదర్శి మాచర్ల రామకృష్ణ గౌడ్ తెలిపారు. సోమవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని, సీఎస్ శాంతికుమారిని, రెవెన్యూశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్‌ను వేర్వేరుగా కలిసి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇంటర్ పరీక్షలు ఫిబ్రవరి 28 నుంచి నిర్వహించనున్న విషయం తెలిసిందే.

కిడ్నాప్‌లు కాదు.. ప్రేమ వివాహాలు!

- అపహరణ కేసుల్లో ఇవే అధికం
- రేప్ కేసుల్లో పెండ్లిపేర వంచించిన కేసులదే సింహభాగం
- చాలా కేసుల్లో తెలిసినవారు, సహచర ఉద్యోగులే నేరస్థులు

హైదరాబాద్, జనవరి 1 (నమస్తే తెలంగాణ): గత ఏడాది నమోదైన కిడ్నాప్ కేసుల్లో అత్యధికం ప్రేమ, పెండ్లి పేరుతో పారిపోయిన ఘటనలే ఉన్నాయి. 2023లో మొత్తం 1,362 కిడ్నాప్ కేసులు నమోదైన 80 శాతం ఈ తరహా జంపింగ్‌లే ఉండటం విశేషం. ప్రేమ కోసం, పెండ్లి కోసం నచ్చిన అబ్బాయి/అమ్మాయితో వెళ్లినా బాధిత తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కిడ్నాప్ కేసులుగా నమోదు చేసినట్టు పోలీసులు వార్షిక క్రైమ్ నివేదికలో వెల్లడించారు. కిడ్నాప్ కేసులను సవాల్‌గా తీసుకొని వారిని వెతికి పట్టుకుంటే ప్రియుడి కోసం, ప్రియురాలి కోసం వెళ్లిన 646 ఘటనలు ఎదురైనట్టు పోలీసులు తెలిపారు. వీటిల్లో పెండ్లయిన వారు కూడా ఉండటం ఆశ్చర్యం కలిగించే అంశం. 329 మంది 18 ఏండ్లు వారు కిడ్నాప్‌కు గురైనట్టు పోలీసులు చెప్పారు. ఆర్థిక సంబంధమైన అంశాల్లో 111 కిడ్నాప్ కేసులు నమోదయ్యాయి. ఆర్థిక సమస్యల్లో భాగంగానే 35 అక్రమ నిర్బంధ కేసులు, పాతకక్షల నేపథ్యంలో 26 కిడ్నాపులు నమోదయ్యాయి.

పెండ్లిపేరుతో నయవంచన..

2023లో నమోదైన లైంగికదాడి కేసుల్లో అత్యధిక కేసుల్లో పెండ్లి చేసుకుంటానని నమ్మించి వంచించిన వారే ఉన్నారు. మొత్తం 2,284 రేప్ కేసుల్లో 1,580 కేసులు పెండ్లి చేసుకుంటానని నమ్మించినవే. మరో దారుణమైన విషయం ఏంటంటే.. ఇంటి చుట్టుపక్కలవారు, సహచర ఉద్యోగులే 307 కేసుల్లో లైంగికదాడులకు పాల్పడటం. ఈ దారుణాలకుతోడు కుటుంబసభ్యుల చేతుల్లో లైంగికదాడికి గురైనవారు 147 మంది ఉన్నారు. తెలియని వ్యక్తులు ద్వారా జరిగిన లైంగికదాడులు ఆరు మాత్రమే. మొత్తంగా 2,284 కేసుల్లో ఆరు కేసులు మినహా.. 2,278 కేసుల్లో బాధితులకు చాలా దగ్గరివారు అంటే కుటుంబసభ్యులు, స్నేహితులు, ప్రేమికులు, తోటి ఉద్యోగులే ఉన్నారు. విచారణ చేపట్టిన 73 రేప్ కేసుల్లో 84 మందికి జీవితఖైదు విధించారు. 2022లో మొత్తం 2,293 లైంగికదాడి కేసులు నమోదవగా.. 2023లో 2,284 కేసులు నమోదయ్యాయి. గతేడాది లైంగికదాడుల కేసుల శాతం 0.39 శాతం తగ్గింది.

ఏఏజీగా ఇమ్రాన్ ఖాన్

హైదరాబాద్, జనవరి 1, (నమస్తే తెలంగాణ): అదనపు అడ్వకేట్ జనరల్ (ఏఏజీ)గా సీనియర్ న్యాయవాది ఇమ్రాన్ ఖాన్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి తిరుపతి పేరిట గత నెల 30న జీవో జారీ అయింది.

రాజధానిలో భీమా కోరెగావ్ విజయ దినోత్సవం

హైదరాబాద్, జనవరి1, (నమస్తే తెలంగాణ): భీమా కోరెగావ్ శౌర్య విజయ దినోత్సవం సోమవారం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై నిర్వహించారు. మాల సంక్షేమ సంఘం, మాల విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు నిమ్మ బాబూరావు.. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, భీమా కోరేగావ్ విజయ స్తూపానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ముచ్చ పంకజ్‌కుమార్, సల్ల నర్సింగ్‌రావు, ఆస మహేశ్, తూర్పు శ్రవణ్‌కుమార్, శ్రీకాంత్, ఆస సుకన్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాంగ్ రేప్ ఘటనపై మహిళా కమిషన్ సీరియస్

హైదరాబాద్, జనవరి 1 (నమస్తే తెలంగాణ): విశాఖ జిల్లా గ్యాంగ్ రేప్ ఘటనపై మహిళా కమిషన్ సీరియస్ అయింది. ఈ ఘటన కేసును సుమోటోగా స్వీకరించింది. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని, పూర్తి వివరాలు వెల్లడించాలని విశాఖపట్నం నగర సీపీకి కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ లేఖ రాశారు. నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బాధిత బాలిక వివరాలపై గోప్యత పాటించాలని, వైద్యసాయం, రక్షణ కల్పించాలని సూచించారు.

న్యూ ఇయర్ వేడుకల్లో ఘర్షణ.. ఒకరి మృతి

- డీజే పాటల విషయంలో గొడవ
- దాడిలో కాంగ్రెస్ నేత మృతి
- కామారెడ్డి జిల్లా నాచుపల్లిలో ఘటన

సాదుల రాములు (ఫైల్)

నస్రుల్లాబాద్, జనవరి 1: పాత సంవత్సరానికి వీడ్కోలు, కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ ఏర్పాటుచేసిన వేడుకలు విషాదం నింపాయి. డీజే పాటల విషయంలో తలెత్తిన ఘర్షణ వ్యక్తి ప్రాణాన్ని బలిగొన్నది. కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలం నాచుపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకున్నది. ఎస్సై లావణ్య, కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం... కాంగ్రెస్ పార్టీ నాచుపల్లి గ్రామ అధ్యక్షుడు సాదుల రాములు (45), గ్రామానికి చెందిన జెల్ల సాయికుమార్, గంపల సుధాకర్, మొండి భాస్కర్, కొప్పుల దివ్య తదితరులు ఆదివారం రాత్రి కాంగ్రెస్ పార్టీకి చెందిన డీజే పాటలు పెట్టుకొని డ్యాన్సులు చేస్తున్నారు. అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు కేసరి రవి, కొంగల అనిల్, కొంగల గోపాల్, కొంగల వినోద్ వారి వద్దకు వెళ్లి బీఆర్ఎస్ పాటలు పెట్టాలని కోరారు. ఇది గమనించిన సాదుల రాములు, విఠల్, భూమయ్య, సాయిలు, హన్మాండ్లు, జెల్ల సాయికుమార్, గైని సాయిలు కలుగజేసుకొని వారిని అక్కడి నుంచి వెళ్లిపోవాలని కోరారు. దీంతో గోపాల్.. సాదుల రాములును దుర్భాషలాడుతూ, చంపేస్తామని బెదిరిస్తూ వెనుదిరిగాడు. కాసేపటికి రాములు ప్రైమరీ పాఠశాల వైపు నుంచి వెళ్తుండగా, అక్కడే ఉన్న కేసరి రవి, అనిల్, గోపాల్, వినోద్ ఒక్కసారిగా అతడిపై దాడి చేసి పిడిగుద్దులు కురిపించారు. దీంతో రాములు అక్కడికక్కడే మృతి చెందాడు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ కుటుంబ సభ్యులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించకుండా అడ్డుకున్నారు. న్యాయం చేస్తామని డీఎస్పీ జగన్నాథరెడ్డి హామీ ఇవ్వడంతో బాధితులు ఆందోళన విరమించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నేత చలసాని సుధీర్ అండ చూసుకొని తన భర్తను హత్య చేశారని, అతడితోపాటు నిందితులపై చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య సుజాత పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చికిత్స పొందుతూ సీఐఎస్ఎఫ్ జవాన్ మృతి

- గత నెల 16న జరిగిన ప్రమాదంలో తలకు గాయమై కోమాలోకి

శివకుమార్ (ఫైల్)

బోయినపల్లి, జనవరి 1: తలకు బలమైన గాయమై కోమాలోకి వెళ్లి దవాఖానలో చికిత్స పొందుతూ సీఐఎస్ఎఫ్‌కు చెందిన ఓ జవాన్ మృతిచెందాడు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం జగ్గారావుపల్లిలో సోమవారం జరిగింది. చాడ శివకుమార్(26) రెండేండ్ల క్రితం సెంట్రల్ ఇండస్ట్రీస్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) విభాగంలో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. ప్రస్తుతం రాజస్థాన్‌లోని 16వ బెటాలియన్ డిలోలీలో డాక్యుమెంటరీ సెక్యూరిటీగా విధులు నిర్వర్తిస్తున్నాడు. కేసీఆర్ ప్రభుత్వం నిర్వహించిన కానిస్టేబుల్ పరీక్షలోనూ అర్హత సాధించగా.. ట్రైనింగ్ సమయం కావడంతో తిరిగివెళ్లాడు. గతేడాది దసరా పండుగకు ఇంటికొచ్చిన శివకుమార్.. తిరిగి విధుల్లో చేరాడు. ఈ క్రమంలో గత డిసెంబర్ 16న ప్రమాదవశాత్తు కిందపడి తలకు బలమైన గాయమై కోమాలోకి వెళ్లాడు. అధికారులు దవాఖానకు తరలించి చికిత్స అందిస్తుండగా.. సోమవారం మృతి చెందాడని కుటుంబ సభ్యులకు సమాచారం వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

కేక్ కటింగ్‌కు వెళ్తూ.. ఇద్దరు విద్యార్థుల దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు.. దవాఖానకు తరలింపు
- పటాన్‌చెరు సమీపంలో బైక్ డివైడర్‌ను ఢీకొని ఘటన
- న్యూ ఇయర్ వేళ రెండు గ్రామాల్లో విషాద ఛాయలు

భరత్‌చందర్ (ఫైల్)

పీ నితిన్ (ఫైల్)

బచ్చన్నపేట/పాలకుర్తి రూరల్/పటాన్‌చెరు, జనవరి 1: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా స్నేహితులతో కలిసి కేక్ కట్ చేసేందుకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఇద్దరు బీటెక్ విద్యార్థులు దుర్మరణం చెందారు. మరో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పట్టణం నోవాపాన్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం అలీంపూర్‌కు చెందిన పాకాల నితిన్ (18), పాలకుర్తి మండలం రాఘవపురానికి చెందిన రాగం భరత్‌చందర్ (19) అక్కడికక్కడే మృతిచెందారు. ఖమ్మం జిల్లాకు చెందిన వంశీ తీవ్రంగా గాయపడ్డాడు.

భార్యతో వివాహేతర సంబంధం..

యువకుడి హత్య

మోర్తాడ్, జనవరి 1: భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే కోపంతో స్నేహితుడిని కత్తితో పొడిచి చంపాడు ఓ యువకుడు. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల మండల కేంద్రానికి చెందిన చెప్పాల రాకేశ్ (26), తెడ్డు సూర్య మంచి స్నేహితులు. సూర్య జీవనోపాధి కోసం గల్ఫ్ వెళ్లేవాడు. రాకేశ్ హైదరాబాద్‌లో డ్రైవింగ్ చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో రాకేశ్.. సూర్య భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే ఆరోపణలు